క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: బీహెచ్ఈఎల్ ఫ్లైఓవర్ నిర్మాణం నేపథ్యంలో తారానగర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మార్పు పనుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు గచ్చిబౌలి ఏడీఈ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సైబర్ సిటీ సర్కిల్ వింగ్ ద్వారా చేపట్టే పనుల నేపథ్యంలో పరిసరాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

27న శాంతిసరోవర్‌లో రక్షాబంధన్ వేడుకలు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'రక్షాబంధన్' వేడకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రసంగాలు, మెడిటేషన్, రాఖీధారణ కార్యక్రమం,ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఆదివారం నిర్వహించే సండే ఈవినింగ్ టాక్ కార్యక్రమంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు ఫోన్: 040 2300 1234లో సంప్రదించాలని వారు కోరారు.

శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మణ్‌గౌడ్


లక్ష్మణ్‌గౌడ్

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మణ్ గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్ కమిషనరేట్ అటాచ్ అయ్యారు. ఆయన స్థానంలో ముషీరాబాద్ మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన లక్ష్మణ్ గౌడ్ శేరిలింగంపల్లికి బదిలీపై వచ్చారు. గతంలో సరూర్‌నగర్, సంగారెడ్డిలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు.

జీతాలు కోసం అభియాన్ ఉద్యోగుల వినతి

పటాన్‌చెరు టౌన్: 'మాకు జీతాలు రావడం లేదని' జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లుకు సమగ్ర శిక్ష జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు మధురనేని శేషాద్రి, సభ్యులు వినతిపత్రం అందజేశారు. గురువారం పట్టణానికి వచ్చిన డీఈఓను కలిసి సమస్యను వివరించారు. దీంతో ఆయన తన వంతుగా పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారని సమగ్ర శిక్ష జాక్ సభ్యులు పేర్కొన్నారు. జిల్లాలోని అభియాన్ ఉద్యోగులు ఇటీవల బదిలీలు కావడం తెలిసిందే. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్, సభ్యులు ఉమా, భాస్కర్, మల్లేశం, యాదయ్య, సుకన్య, రామకృష్ణసాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాంధీని కలిసిన టీఎన్‌జీఓ కాలనీవాసులు

గచ్చిబౌలి: ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆరెకపూడి గాంధీని రంగారెడ్డి జిల్లా టీఎన్‌జీఓ కాలనీవాసులు గురువారం కలిశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం జంగయ్య ఆధ్వర్యంలో పలువురు స్థానికులు ఎమ్మెల్యే గాంధీని కలిసి ఆయనను సత్కరించారు. అనంతరం బీఆర్ఎస్ శేరిలింగంపల్లి అభ్యర్థిగా సీఎం కేసీఆర్ మరోసారి పోటీ చేసే అవకాశం కల్పించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు. సొసైటీ కార్యదర్శి కె.జోసెఫ్, సహాయ కార్యదర్శి శంకరయ్య, సభ్యులు జి.రాములు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గాంధీని కలిసిన బృందం

చెత్తకుప్పలతో పరేషాన్!

అంతర్జాతీయ సదస్సులకు నిలయంగా ఉన్న మాదాపూర్ పరిసర ప్రాంతాలు అస్తవ్యస్తంగా మారాయి. పచ్చదనం, పరిశుభ్రత ఉండాల్సిన ప్రాంతాలలో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు, రోడ్లపై మురుగు దర్శనమిస్తున్నాయి. శిల్పారామం, దుర్గం చెరువు లాంటి పర్యాటక ప్రాంతాలు ఉన్నా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్ల పక్కనే చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి.


మాదాపూర్‌లో రోడ్ల పక్కనే పేరుకుపోయిన చెత్తకుప్పలు

- మాదాపూర్ పరిసర ప్రాంతాలలో రోడ్ల పక్కనే చెత్తకుప్పలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలంటూ కోరుతున్న స్థానికులు

మాదాపూర్: మాదాపూర్ పరిసరాల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్న వైనంపై స్థానిక నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదని సీనియర్ సిటిజన్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి వర్షానికే రోడ్లు మురికికూపాలుగా మారిపోతున్నాయి.

- మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ, చందానాయక్ తండా, సాయినగర్, సర్వే ఆఫ్ ఇండియా తదితర ప్రాంతాలలో రోడ్లపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి.
- రోడ్లపై చెత్తకుప్పలు ఉండటంతో కొద్దిపాటి వర్షం పడిందంటే మురికిగా మారి దర్వాసనను వెదజల్లుతున్నాయి.
- వాహనదారులు, పాదచారులు ముక్కులు మూసుకునే పరిస్థితి ఏర్పడుతోంది.
- ఐటీ ప్రాంతం కావడంతో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి ప్రాంతాల్లో రోడ్ల పక్కన ఉన్న చెత్త కుప్పలను తొలగించడం లేదని సర్వత్రా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- నగర పరిశుభ్రత కోసం జీహెచ్ఎంసీ కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నా ఫలితం లేకుండా పోతోందనే ఆవేదన వ్యక్తం అవుతోంది. అనవసరమైన ఖర్చులు చేస్తు ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.
- మాదాపూర్ అంటే ఎంతో పేరు ఉన్నప్పటికి అంతా అపరిశుభ్రంగా ఉంటుందని తెలిపారు. విదేశాల నుంచి వచ్చిన సందర్శకులకు సైతం చులకనగా ఉంటుందని అన్నారు.
- చెత్తకుప్పలను తొలగించక పోవడంతో ఈగలు, దోమలు ప్రభలి విషజ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- అధికారులు వెంటనే స్పందించి మాదాపూర్ పరిసరప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.


మాదాపూర్‌లోని రోడ్లు బురదమయం

ఆరెకపూడి గాంధీకి పలువురి మద్దతు


గాంధీని సత్కరించిన మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు

రాయదుర్గం: ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి బీఆర్ఎస్ పార్టీ గచ్చిబౌలి డివిజన్ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రాష్ట్ర సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గాంధీకి మరోసారి బీఆర్ఎస్ టికెట్ ప్రకటించిన నేపథ్యంలో గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో గాంధీ నివాసానికి పెద్ద సంఖ్యలో వాహనాల్లో వెళ్లి ఆయనను ఘనంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయడం, ప్రజలు ఆదరించడంతోనే తాను ఎమ్మెల్యేగా ఎన్నికై నట్లు ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లోనూ అందరూ ఆదే స్ఫూర్తితో పని చేయాలని కోరారు. పలువురు గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ వార్డు, ఏరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సురక్షిత ట్రాఫిక్ జోన్ సాధనలో వలంటీర్ల పాత్ర భేష్


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ ట్రాఫిక్ హర్షవర్ధన్

సైబరాబాద్ ట్రాఫిక్–1 డీసీపీ హర్షవర్ధన్

రాయదుర్గం: సురక్షితమైన ట్రాఫిక్ జోన్‌గా సైబరాబాద్‌ను రూపొందించడంలో వలంటీర్ల పాత్ర అమోఘమని సైబరాబాద్ ట్రాఫిక్–1 డీసీపీ హర్షవర్ధన్ పేర్కొన్నారు. సైబరాబాద్ పోలీసులు, ఎస్‌సీఎస్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో డిలాయిట్ సంస్థలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిర్వహణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యోగులకు రోడ్డు సంకేతాలు, రాంగ్ రూట్ డ్రైవింగ్, లేన్ క్రమశిక్షణ, మోటార్ వెహికిల్ డ్రైవింగ్ రెగ్యులేషన్ చట్టాలు, బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తన మొదలైన వాటిపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఇదిలావుండగా హర్షవర్ధన్ ఐపీఎస్‌లో చేరడానికి ముందు డెలాయిట్‌లో పూర్వ ఉద్యోగి కావడంతో ఆయన డెలాయిట్ క్యాంపస్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం విశేషం. ఈ సందర్భంగా ప్రమాదాలకు దారితీసే రియల్ టైమ్ ట్రాఫిక్ దృశ్యాలు, అజాగ్రత్త, అలసత్వ ప్రవర్తన ప్రాణాంతక సంఘటనలకు ఎలా దారితీస్తాయో విశ్లేషించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ ట్రాఫిక్ రణ్వీర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, ట్రాఫిక్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ టీమ్ లలితా టీమ్స్, ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధి కేశవ్ భండారి, పలువురు ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆపద్బాంధువుడు సీఎం కేసీఆర్


దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న గాంధీ, కార్పొరేటర్లు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హఫీజ్‌పేట్: దివ్యాంగుల పాలిట సీఎం కేసీఆర్ ఆపద్బాంధవుడు అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం చందానగర్‌లోని అంబేడ్కర్ కల్యాణ మండపంలో సీఎం కేసీఆర్ దివ్యాంగులకు రూ. 3016 నుంచి రూ. 4016కు పెంచిన శుభ సందర్భంగా 2785 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను రంగారెడ్డి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాకర్‌రావు, నియోజకవర్గం కార్పొరేటర్లతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... అసహాయులకు ఆసరాతో కొండంత అండగా నిలుస్తున్న వ్యక్తి, దివ్యాంగుల పాలిట దేవుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. ఇటీవల కాలంలో కన్న బిడ్డలే చూసుకొని ఈ తరుణంలో ప్రతి నెల పెన్షన్ ఇస్తూ, వెయ్యి రూపాయాలు పెంచి వారందరికి పెద్ద కొడుకులాగా ఉన్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దివ్యాంగుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అత్యధిక ఫించన్లు ఇస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వీరందరికే కాకుండా బీడీ, చేనేత, గౌడ కార్మికులకు, డయాలసిస్, బోధకాలు బాధితులకు కూడా ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, నార్నె శ్రీనివాస్‌రావు, రోజాదేవి రంగరావు, పూజిత గౌడ్, ప్రాజెక్టు అధికారులు ఉషారాణి, నాగమల్లీశ్వరి, ఇంద్రసేన, మాజీ కాన్సిలర్లు రఘుపతిరెడ్డి, మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్ రంగరావు, నాయకులు రఘునాథ్‌రెడ్డి, గణేష్ ముదిరాజ్, రాజు యాదవ్, ఉట్ల కృష్ణ, హరీష్‌రావు, లక్ష్మారెడ్డి, ప్రసాద్, రవీందర్‌గౌడ్, చాంద్‌పాషా, వెంకటేష్, రమేష్ పటేల్, రాజేందర్, రాంమాబు, అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన కెనడా బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీని కెనడా దేశంలోని అంటారియాకి చెందిన వెస్టర్న్ యూనివర్శిటీ ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. వెస్టర్న్ యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ అలాన్‌షెపర్డ్, ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ కెన్నెత్ ఎస్ కోలీ, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ లిల్లీచో, శాస్త్రి ఇండో–కెనడియన్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఐసీఐ) ద్వారా ఈ పర్యటన సాగింది. ఈ సందర్భంగా మొదట ఈ బృందం హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు, ఇతర హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, విద్యావేత్తలతో విద్యా సంబంధ అంశాలపై చర్చించారు. పరస్పర ఆసక్తి ఉన్న రంగాలలో సహకార అవకాశాలను, కొత్త వ్యూహాత్మక భాగస్వామ్యాలను అన్వేసించడం ఈ ప్రతినిధి బృందం పర్యటన లక్ష్యం.

బీజేపీ నేతల అరెస్టు అప్రజాస్వామికం


పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న నేతలు

మియాపూర్: తమ హక్కుల సాధనకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని బీజేపీ కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు పది సంవత్సరాలు గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు హామీలిచ్చి నెరవేర్చకపోవడంతో నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో మియాపూర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవికుమార్ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడికి వెళ్తుండగా మియాపూర్ పోలీసులు వారిని కార్యాలయం రోడ్డులో అడ్డుకుని బీజేపీ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేశారు. అదేవిధంగా అక్రమ అరెస్టులను నిరసిస్తూ కార్యకర్తలు పోలీసులు పోలీస్ స్టేషన్‌ముందు ధర్నా నిర్వహించారు. నేతలు గంగాధర్‌రెడ్డి, వినోదరావు, నవతారెడ్డి, రాధాకృష్ణ, ఎల్లేష్, ఆంజనేయులు, సాగర్, మాణిక్‌రావు, గణేష్, లక్ష్మణ్, శ్రీశైలం, పద్మ నర్సింగ్‌రావు, భాస్కర్ రెడ్డి, మలాకర్‌రెడ్డి, రామరాజు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై పనిచేద్దాం

బీజేపీ రాష్ట్ర నాయకుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి


సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

హఫీజ్‌పేట్: ప్రజాసమస్యలను గుర్తించి వాటి పరిష్కారం చేసే దిశగా సమష్టిగా కృషి చేసి వారి మన్ననలను పొందేలా పని చేద్దామని బీజేపీ రాష్ట్ర నాయకుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చందానగర్‌లోని స్వాగత్ హోటల్‌లో ఆయన బీజేపీ నాయకులు విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో ప్రభుత్వం మారాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వ్యవస్థలు నిర్వీర్యమై మాఫియా వ్యవస్థలు రాజ్యమేలుతున్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే రాష్ట్రం అప్పుల ఊబిలో మరింత కురుకుపోయే ప్రమాదముందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అధికారులు ప్రజలకు కాకుండా అధికార పార్టీకి అడుగులకు మడుగులు పడుతున్నారన్నారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ కారాలయాలు అధికార పార్టీకి దళారులకు అడ్డాలుగా మారాయన్నారు. నేతలు అజియ్ కుమార్, నూనె సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ బి.వి.సత్యరమేష్, నందనం వినయ, రాధామూర్తి, వేణుగోపాల్, త్రినాథ్, డాక్టర్ రాజేందర్‌రెడ్డి, నరేష్ కుమార్, కుందన్ కుమార్‌గుప్తా, ఆంజనేయులు, చందు, ప్రభాకర్, పాండుగౌడ్, చవగాని శ్రీనివాస్, రాజేష్ శెట్టి పాల్గొన్నారు.

యువత కోసం 'యూస్టా' ప్రారంభం

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని శరత్‌సిటీ మాల్‌లో దేశంలోనే అతిపెద్ద రిటైలర్ రిలయన్స్ రిటైల్ యువత కోసం ప్రత్యేకించిన ఫ్యాషన్ రిటైల్ ఫార్మాట్ 'యూస్టా'ను గురువారం ప్రారంభించారు. సమకాలీన సాంకేతిక ఆధారిత స్టోర్ లే అవుట్లతో, యువ వినియోగదారుల కోసమే ప్రత్యేకంగా సరసమైన ధరలలో హై ఫ్యాషన్‌ను యూస్టా అందిస్తుంది. ఈ సందర్భంగా రిలయన్స్ రిటైల్ ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ప్రెసిడెంట్, సీఈఓ అఖిలేష్‌ప్రసాద్ మాట్లాడుతూ... యూస్టా ఒక యువ డైనమిక్ బ్రాండ్ అని పేర్కొన్నారు. ఇది ఈ దేశంలోని యువతతో పెరుగుతుందన్నారు. వారితోపాటే అభివృద్ధి కూడా చెందుతుందన్నారు.

ఫ్యాషన్ అవసరాలను అర్థం చేసుకోవడానికి ఈ బృందం భారతదేశ యువతరంతో నిరంతరం పనిచేస్తుందన్నారు. రోజూ తాజాదనంపరంగా ఔచిత్యం పరంగా డేవన్‌గా ఉంటుందన్నారు. యూస్టా యువతకు వాయిస్ ఇవ్వడమే కాకుండా తమను తాము వ్యక్తీకరించుకునే స్వేచ్ఛను కూడా ఇస్తుందన్నారు. యూస్టా రేంజ్ అంతా ఇప్పుడు హైదరాబాద్ నగరంలో ఈ బ్రాండ్ యొక్క మొట్టమొదటి స్టోర్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. అంతేకాక ఆన్‌లైన్‌లోనూ ఏజియో, జియోమార్ట్ ద్వారా కూడా పొందవచ్చన్నారు.

గీతంలో స్మార్ట్ ఐడియాథాన్ ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: గీతం స్మార్ట్ ఐడియాథాన్ (అత్యుత్తమ ఆవిష్కరణలు చేసిన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమం) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, రుద్రారం ప్రాంగణంలో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. స్టార్టప్ ఇండియా, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎమర్జింగ్ మార్కెట్స్ (సీఈఎం), బోస్టన్లోని నార్త్ ఈస్టన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ఎడ్యుకేషన్ (ఎన్ఎయూసీఈఈ) సహకారంతో నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిలుగా హైదరాబాద్ ఏంజెల్స్ చైర్మన్ రాజేష్ మంతెన, ఆత్మీయ అతిథిగా కంట్రోల్ ఎస్ క్వాలిటీ– ప్రొక్యూర్మెంట్ హెడ్ చంద్రశేఖరశర్మ గరిమెళ్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత జీవితంలో రాణించడానికి ఉపకరించే ప్రాథమిక అంశాలైన ఉత్సుకత, ధైర్యం, శీలం, భావప్రకటనా నైపుణ్యాలపై పట్టు పెంచుకోవాలని వివరించారు. అనంతరం ఉన్నత విద్యా సంస్థలలోని విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదిగే వాతావరణాన్ని ఎలా సృష్టించాలి? అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్) జీవశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సుస్మితసుందర్, టీహబ్ డైరెక్టర్ (వ్యూహం–భాగస్వామ్యం) సృజన చదలవాడ, ఐఎస్‌బీలోని ఐ–వెంచర్ అసోసియేట్ వెస్ట్ ప్రెసిడెంట్ సురేష్ కృష్ణ, ఐటీఐసీ దృవ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం ఉన్నా లేనట్లే

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్


హుడాకాలనీలో పర్యటిస్తున్న రవికుమార్‌యాదవ్

హఫీజ్‌పేట్: ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం ఉన్నా లేనట్లేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడాకాలనీలో బీజేపీ గడపగడపకూ రవన్న ప్రజాయాత్రను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలు గాలికి వదిలేసి రియల్ ఎస్టేట్, కబ్జాలపై దృష్టి పెడుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. బీజేపీ నాయకులు అనంత రెడ్డి, రమణయ్య, శ్రీనివాస్ యాదవ్, వెంకటేశ్వర్లు, మహేష్ యాదవ్, రమేష్, విజయ్, రాజు, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల సత్వర పరిష్కారం


శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న అధికారులు

గచ్చిబౌలి: వివిధ విభాగాల అధికారుల సమన్వయంతోనే సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు వీలవుతుందని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో వివిద విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులు పోలీసులకు సహకరించాలని జడ్సీ కోరారు. ఏఐజీ హాస్పిటల్, క్యూమార్ట్ నుంచి గచ్చిబౌలి రోడ్డు, మీనాక్షీ జంక్షన్ నుంచి ఐకియా వెళ్లే రోడ్డు, ఇజ్జత్‌నగర్ కల్వర్ట్‌ను విస్తరించాలని అధికారులను ఆదేశించారు. గౌలిదొడ్డి, కల్వరి టెంపుల్ డార్క్ స్పాట్స్, వాటర్ లాగింగ్ పాయింట్లు, పర్వత్ జంక్షన్‌లో విద్యుత్ స్తంభాలను మార్చాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు ట్రాఫిక్ అంతరాయంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ హర్షవర్ధన్, హెచ్ఆర్‌డీసీఎల్, మెట్రో రైల్, నేషనల్ హైవే, టీఎస్ఐఐసీ, టీఎస్ఎస్పీ డీసీఎల్, వాటర్‌వర్క్స్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు చేయాలి: జడ్సీ

వచ్చే ఎన్నికల ఏర్పాట్లకు సంబంధిత అధికారులు, సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని వెస్ట్ జోనల్ కమిషనర్, శేరిలింగంపల్లి నియోజకవర్గం–052 రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం సెక్టర్ ఆఫీసర్స్‌తో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ప్రతి సెక్టర్‌లో 15 పోలింగ్ బూత్‌లు ఉంటాయని, రూట్‌మ్యాప్‌తయారు చేసుకోవాలని సూచించారు. తమకు కెటాయించిన పోలింగ్ స్టేషన్లను సందర్శించి అక్కడి సమస్యలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. వసతుల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. 49 మంది ఆఫీసర్లు పాల్గొన్నారు.

సంస్థల బలోపేతానికి కట్టుబడి ఉన్నాం


మాట్లాడుతున్న సమీర్ రాజే

గచ్చిబౌలి: భారతదేశంలోని సంస్థలన్నింటినీ బలోపేతం చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని జూమ్ ఇండియా సార్క్ జనరల్ మేనేజ్, హెడ్ సమీర్ రాజే పేర్కొన్నారు. 'జూమ్' ఆధ్వర్యంలో జూమ్ అనుభవ దినోత్సవాన్ని గచ్చిబౌలిలోని లీ మెరిడియన్ హోటల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధునాతన సాంకేతిక విధానాలు జూమ్ నిర్వహణలో రావడంతో సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, వినియోగదారుల పని సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఎంతగానో జూమ్ ఉపయోగపడుతుందన్నారు. జూమ్ నిర్వహణతోనే టీమ్ చాట్, మీటింగ్స్, కాంటాక్ట్, స్మార్ట్ రికార్డింగ్ వంటి ప్రక్రియల ద్వారా ప్రజలకు చేరుయ్యే అవకాశం ఉంటుందన్నారు. కంపెనీ ఆధునిక సామర్థ్యాలను దాని డైనమిక్, తెలివైన నిర్ణయాలను వెల్లడించడానికి జూమ్ నిర్వహణ తోడ్పడుతుందన్నారు. దీంతో కంపెనీలు తమ ఉత్పాదకతను పెంచుకోగలవన్నారు. ఇటీవల వచ్చిన వర్క్ వివో జూమ్ సంస్థలో పనిచేసే ఉద్యోగులకు సరికొత్త విధానాలను తీసుకొచ్చిందన్నారు. దీంతోనే ఉద్యోగులు సరికొత్త అనుభూతిని పొందుతారన్నారు. వినియోగదారులతో సంబంధాలను మెరుగుపర్చడంలో ఇవి తోడ్పడుతాయన్నారు. కార్యక్రమంలో సొల్యూషన్ ఇంజినీరింగ్ ఇండియా మేనేజర్ మెహర్‌కుమార్ ఉల్లిపాలెమ్ ప్రసంగించారు.